JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
# ప్రభాత జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి | బుధవారం 05-11-2025
Medchal - Malkajgiri | Wednday 05-11-2025
jayabherinews
సంపుటి : 02 | సంచిక : 159 | పేజీలు : 8 | వెల : 5
Vol. 02 | Issue 159 | Pages : 8 | ₹: 5



# కార్తీక పౌర్ణమి విశిష్టత

2025 కార్తీక పూర్ణిమ హిందువులు జరుపుకునే పెద్ద పండుగ. ఈ పండుగ రోజు శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న శివాలయాలు శివనామస్మరణతో మార్మోగుతాయి. ఈ పూర్ణిమ గురించి ప్రాచీన గ్రంథాలలో అనేక విధాలుగా అభివర్ణించారు. ఈ పూర్ణిమ రోజున పరమ శివుడు త్రిపురాసురుడు అనే రాక్షసుడిని సంహరించినట్లు మనకు పురాణాల ప్రకారం చెప్పబడింది. అందుకోసమనే ఈ పూర్ణిమను త్రిపురి పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ఈ పూర్ణిమ రోజు భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పరమ శివుడికి దీపారాధన చేస్తారు. శివుడు ఆ రాక్షసుడి బారి నుంచి ప్రజలను విముక్తులను చేయడంతో ఈ పండుగను చాలా పెద్ద ఎత్తున జరుపుకుంటారు.

4 లో



# ఇది కారుకు.. బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నిక

- బుల్డోజర్ సర్కార్‌కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకు ఓటేయాలి
- మీ ఇంటి పైకి బుల్డోజర్ రాకుండా ఉండాలంటే.. జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి.
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**జయభేరి, జూబ్లీహిల్స్ :**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా సోమాజిగూడలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. మీ ఉత్సాహం చూస్తుంటే గెలుపు పక్కా అని తేలిపోయింది.. మెజార్టీ మాత్రమే తేలాలి. అందరికి అన్నం పెట్టే నగరం హైదరాబాద్. కులం, మతం, ప్రాంతం ఎవరినైనా కడుపులో పెట్టుకొని చూసుకునే నగరం హైదరాబాద్. ప్రతి ఇంట్లో, షాపులో ఇన్వర్టర్లు పెట్టుకునే పరిస్థితి ఉండేది. సమ్మర్ వచ్చిందంటే తాగు నీటికి కటకట ఉండేది. కేసీఆర్ సీఎం అయిన తర్వాత.. రాష్ట్రాన్ని చంటిబిడ్డలా చూసుకొని బాగు చేసుకున్నారు. ఇన్వర్టర్‌లు, జనరేటర్‌లు మాయమయ్యాయి.. పరిశ్రమలకు ఇబ్బంది లేకుండా చేసుకున్నాం. తాగునీటి సమస్య తీర్చాం. కొత్త పాలసీలు తీసుకొచ్చి ఐటీ, ఎలక్ట్రానిక్ పాలసీ వంటి ఎన్నో పాలసీలు తీసుకొచ్చాం. 3 లక్షల ఐటీ ఉద్యోగులను 10 లక్షలకు తీసుకెళ్లాం. రియల్ ఎస్టేట్ పెరిగింది. వాటితో పాటు ఇతర వ్యాపారాలు పెరిగాయి. ఓలా, ఉబర్, జొమాటో, గిగ్ వర్కర్లు

...మిగతాది 2 లో

# సిఐఐ సమ్మిట్ తో మారనున్న ఏపీ



**అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ ద్వారా రూ.1.5లక్షల కోట్లు, దేశచరిత్రలో అతిపెద్ద ఎఫ్ డీఐ గూగుల్ $15 బిలియన్ డాలర్లు, నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ లక్ష కోట్లు, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ 1.25లక్షల కోట్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి.**

**జయభేరి, విజయవాడ, నవంబర్ 4:**

సమ్మిట్ సన్నాహక ఏర్పాట్లపై మంత్రి లోకేష్ ఉన్నతస్థాయి సమీక్షించారు. ఇప్పటివరకు 45దేశాల నుంచి 300మంది వివిధ రంగాల ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు వస్తున్నట్లు మాకు సమాచారం ఉంది. సమ్మిట్ లో 12 మల్టీ లాటరల్ ఆర్గనైజేషన్స్, 72మంది ఇంటర్నేషనల్ స్పీకర్స్ పాల్గొంటారు. 48 స్పీకింగ్ సెషన్స్ లో సెక్టార్లవారీగా వివిధ అంశాలపై విస్తృతంగా చర్చలు జరుపుతాం. ఈసారి పార్టనర్ షిప్ సమ్మిట్ లో 410 ఎంవోయూలపై సంతకం చేయబోతున్నాం. వీటిద్వారా రూ.9.8లక్షల కోట్ల పెట్టుబడులు, 7.5లక్షల

...మిగతాది 2 లో


# అమెజాన్ ప్రతినిధులతో రేవంత్ భేటీ



**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 4:**

అమెజాన్ వెబ్ సర్వీసెస్ ప్రతినిధి బృందం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. తెలంగాణలో ఏడబ్ల్యూఎస్ ఆన్ గోయింగ్ సెంటర్లు, వాటి విస్తరణపై చర్చించింది. ఈ సమావేశానికి ఏడబ్ల్యూఎస్ డేటా సెంటర్ గ్లోబల్ హెడ్, ఇన్‌ఫ్రా పబ్లిక్ పాలసీ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు.జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖేల్ హాస్పర్ బృందం కూడా ముఖ్యమంత్రితో సమావేశమైంది. హైదరాబాద్‌లో జీసీసీని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రికి తెలిపింది.

డ్యూయిష్ బోర్స్ కంపెనీ విస్తరణలో భాగంగా హైదరాబాద్‌లో జీసీసీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా రానున్న రెండేళ్లలో సుమారు వెయ్యి మంది ఐటీ నిపుణులకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు దొరుకుతాయని వెల్లడించింది.పెట్టుబడులకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. హైదరాబాద్‌ను ఇన్నోవేషన్ హబ్‌గా మార్చడానికి జర్మనీ సహకారం అవసరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులకు జర్మన్ భాష బోధించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని ముఖ్యమంత్రి కోరారు. పెట్టుబడుల విషయంలో తెలంగాణ, జర్మనీ భాగస్వామ్యం మరింత బలపడాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్స్ రంగాల్లో జర్మనీ కంపెనీలను పెట్టుబడులు పెట్టమని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.



# గచ్చిబౌలిలో రేవ్ పార్టీ భగ్నం

- ముషిరాబాద్ లో డాక్టర్ అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్, నవంబర్ 4 :**

సైబరాబాద్‌లో డ్రగ్స్ కలకలం మరోసారి సృష్టించింది. గచ్చిబౌలిలోని ఓ కోలివింగ్ గెస్ట్ రూమ్‌లో జరుగుతున్న డ్రగ్స్ పార్టీని స్పెషల్ ఆపరేషన్స్ టీమ్ (SOT) పోలీసులు భగ్నం చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు స్మగ్లర్లతో సహా మొత్తం 12 మందిని అరెస్ట్ చేశారు. గచ్చిబౌలిలోని కోలివింగ్ గెస్ట్ రూమ్‌లో రహస్యంగా డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న పక్కా సమాచారంతో ఎస్ఓటీ బృందం దాడి చేసింది. డ్రగ్స్ పార్టీ చేసుకుంటున్న 12 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో ఆరుగురు డ్రగ్స్ పెడ్లర్లు (సరఫరాదారులు), ఆరుగురు కన్జ్యూమర్స్ (వినియోగదారులు) ఉన్నారు. ఈ పార్టీలో MDMA (ఎండీఎంఏ) తో పాటు గంజాయిని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

...మిగతాది 2 లో

# కవిత రాజకీయ ఎత్తుగడ


## యూటర్న్ తీసుకొని కాంగ్రెస్.. బీజేపిలపై టార్గెట్ చేసిందా..!?

# 143 దేశాలకు గానూ గత ఏడాది 79వ స్థానంలో నిలిచిన భారత్

- వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్-2025లో దిగజారిన ఇండియా ర్యాంకు

**జయభేరి, న్యూఢిల్లీ, నవంబర్ 4 :**

మోదీ పాలనలో దేశం తిరోగమనం చెందుతున్నది. దేశ ప్రగతికి కొలమానంగా నిలిచే పలు అంతర్జాతీయ సూచీల్లో భారత్ ర్యాంకు అంతకంతకూ దిగజారుతున్నది. తాజాగా విడుదలైన వరల్డ్ జస్టిస్ ప్రాజెక్ట్ రూల్ ఆఫ్ లా ఇండెక్స్2025లో ఇండియా ర్యాంకు మరింత పతనమైంది. 143 దేశాలకు గానూ గత ఏడాది 79వ స్థానంలో నిలిచిన భారత్.. ఈ ఏడాది ఏడు స్థానాలు దిగజారి 86వ ర్యాంకులో నిలిచింది. ప్రభుత్వ అధికారాలపై నియంత్రణలు, అవినీతి రాహిత్యం, ప్రభుత్వ పారదర్శకత, ప్రాథమిక హక్కులు, శాంతి భద్రతలు, చట్టాల అమలు వంటి అంశాలలో ఆయా దేశాలలో సాధించిన



ప్రగతి ప్రాతిపదికన చట్టబద్ధ పాలన సూచీ రూపొందుతుంది.మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూల్ ఆఫ్ లా ఇండెక్స్‌లో

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## ఇది కారుకు.. బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నిక

ఎలా వేలాది మందికి ఉద్యోగాలు ఇచ్చాం. శాంతి భద్రతలు కాపాడి.. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధిలో సంక్షేమంలో మనతో పోటీ పడే పరిస్థితి లేదు. ఇమామ్‌లను, పూజారులను, పాస్టర్లు.. ఇలా సబ్బండ వర్ణాలను మోసం చేశారు. అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చారు. కాంగ్రెస్ ఎన్ని హామీలు ఇచ్చిందో గుర్తు చేసుకోవాలి. అత్తలకు రూ.4 వేలు, కోడళ్లకు రూ.2500, వృద్ధులకు రూ.4వేలు పెన్షన్ అన్నారు. తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారు. యువతులకు స్కూటీలు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు, రైతన్నలకు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ అన్నారు. రెండేళ్లలో రెండు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు అన్నారు. మైనార్టీలకు రూ.4వేల కోట్ల బడ్జెట్ అన్నారు, సబ్ ప్లాన్ అన్నారు.. ఒక్కటి కూడా అమలు చేయలేదు. ప్రతి ఒక్కరికి, ప్రతి వర్గాన్ని ఇలా అందరినీ కాంగ్రెస్ మోసం చేసింది. దళితబంధు రూ.12 లక్షలు ఇస్తామన్నారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగం ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇప్పిస్తామని రాహుల్ గాంధీ చెబితే పాపం విద్యార్థులు నమ్మారు. ఇప్పుడు ఆ విద్యార్థులే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్ మెంట్‌ను ప్రభుత్వం పక్కనపెట్టేసింది. విద్యాసంస్థలకు ఇవ్వాల్సిన రూ.10వేల కోట్ల బకాయిలు చెల్లించలేదు. రూ.10వేల కోట్ల బాకీలు అడిగితే కాలేజీలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. కాలేజీలు మూయిస్తానంటూ బెదిరిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా లేకుండా పోయింది. విద్యార్థుల ఫీజులు కట్టని సర్కార్.. జూబ్లీహిల్స్‌ను అభివృద్ధి చేస్తానంటే ఎలా నమ్ముతాం. లక్షలాది మంది విద్యార్థుల ఫీజులు కట్టలేదు. పీఆర్సీ లేదు.. ఉద్యోగుల బాధలను కూడా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పెన్షనర్లను ప్రభుత్వం ఇబ్బంది పెడుతోంది. రెండేళ్ల నుంచి వారు బకాయిల కోసం ఎదురుచూస్తున్నారు. చూసి చూసి వారి గుండెలు ఆగిపోతున్నాయి కానీ.. రేవంత్ రెడ్డి గుండె కరగడం లేదు. రేవంత్ రెడ్డి నడుపుతున్నది సర్కారా.. బెదిరింపుల దర్బారా అర్థం కావడం లేదు. కొత్త ఉద్యోగాల్లో చేరిన వారిని బెదిరించారు.. తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే జీతాల్లో 15 శాతం కోత పెడతా అన్నారు. మరి రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించని రేవంత్ రెడ్డి జీతంలో కూడా కోత పెట్టాలి కదా? ఒక్క చాన్స్ ఇవ్వండి అని మళ్లీ అడుగుతున్నారు. ఒక్క చాన్స్ ఇచ్చినందుకే కదా రాష్ట్రం భ్రష్టు పట్టింది. ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే కదా ఆటో అన్నల ఆత్మహత్యలు.
రియల్ ఎస్టేట్ నాశనం అయ్యింది.. గురుకులాలు ఆగమైపోయాయి. ఫస్ట్ ప్లేస్‌లో ఉన్న రాష్ట్రం చివరి స్థానానికి పడిపోయింది. ఇళ్లు కూలగొట్టుడే ఇందిరమ్మ రాజ్యం అన్నట్లు తయారైంది. హైడ్రా భూతం పేదల ఇండ్లు కూలగొడుతోంది. పేదలను బయటకు గుంజుకొచ్చి.. ఇళ్లు కూలగొడుతున్నారు. బుక్స్ తీసుకుంటాం అని చిన్నారులు అడిగితే కూడా బయటకు లాగి కూలగొట్టారు. పేదల కోసమేనా హైడ్రా.. పెద్దలకు వర్తించదా.. తిరుపతి రెడ్డి ఇంటికి వెళ్లదు.. మంత్రులు పొంగులేటి, వివేక్ ఇండ్లకు హైడ్రా వెళ్లదు. ఇది ఆషామాషీ పోటీ కాదు.. ఇక్కడ కారుకు, బుల్డోజర్‌కు మధ్య .జరుగుతున్న ఎన్నిక. బుల్డోజర్ సర్కార్‌కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకు ఓటేయాలి. బుల్డోజర్‌కు అడ్డొచ్చేది కారు గుర్తు మాత్రమే..

## సిఐఐ సమ్మిట్ తో మారనున్న ఏపీ

ఉద్యోగావకాశాలు రాబోతున్నాయని తెలిపారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రవ్యాప్తంగా 3,132 కి.మీ.లు నడిచానని అప్పట్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం వచ్చాక 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నారా లోకేష్ తెలిపారు. కేబినెట్ సబ్ కమిటీలో మంత్రులందరం కలసికట్టుగా పనిచేసి బెస్ట్ ఇన్ క్లాస్ పాలసీలను తీసుకువచ్చాం. దీనివల్ల గత 16నెలల్లో రాష్ట్రానికి పెద్దఎత్తున పరిశ్రమలు తరలివచ్చాయి. సరైన ఎకోసిస్టమ్ లేకపోవడం వల్లే రాష్ట్రానికి పరిశ్రమలు రావడం లేదని గుర్తించాం. తెలుగువారు ప్రపంచాన్ని శాసిస్తున్నా వారు స్థానికంగా పనిచేయకపోవడానికి అదే ప్రధాన కారణం. అందువల్లే పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంపై దృష్టిపెట్టాం. ఫలితంగా గత 16నెలల్లో 120 బిలియన్ డాలర్ల పెట్టుబడులు (రూ.10లక్షల కోట్లు) ఏపీకి వచ్చాయి. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ ద్వారా రూ.1.5లక్షల కోట్లు, దేశచరిత్రలో అతిపెద్ద ఎఫ్ డీఐ గూగుల్ $15 బిలియన్ డాలర్లు, నెల్లూరు జిల్లాలో బీపీసీఎల్ లక్ష కోట్లు, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ 1.25లక్షల కోట్ల భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. డొమెస్టిక్ ఇన్వెస్టిమెంట్ లోనే కాకుండా ఎఫ్ డీఐలలో కూడా ఏపీ నెం.1గా నిలుస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో అవలంభిస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాల వల్లే కంపెనీలు తమ పెట్టుబడులకు ఏపీని ఎంచుకుంటున్నాయి. పక్కరాష్ట్రాలు కూడా పోటీపడి ఇన్సెంటివ్స్ ఇస్తున్నా ఏపీ వైపు మొగ్గుచూపడానికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ విధానాలే కారణం. టీసీఎస్, ప్రీమియర్ ఎనర్జీ, రెన్యుపవర్ వంటి భారీ కంపెనీలు అందువల్లే క్యూకట్టాయి. ఏపీలో అద్భుతమైన సీ కోస్ట్ లైన్ ఉంది. గ్రాండ్ కానియన్ ఆఫ్ ఇండియాగా పేరొందిన గండికోట ఉంది. సమర్థవంతమైన టాలెంట్ పూల్, పోర్టు లాజిస్టిక్ లింకేజి ఉంది. ఎంఎస్ఎంఈలను ప్రోత్సహిస్తున్నాం. పర్యాటక రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. ఏపీకి భారీఎత్తున పెట్టుబడులు రావడానికి మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. అందులో మొదటిది అనుభవం కలిగిన సమర్థ నాయకత్వం గల ఏకైక రాష్ట్రమని స్పష్టం చేశారు. కేంద్రంలో ప్రధాని మోడీజీ, రాష్ట్రంలో చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. వారి సమన్వయం వల్లే గూగుల్ లాంటి భారీ పెట్టుబడి రాష్ట్రానికి వచ్చింది. మోడీ గారితోపాటు కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వనీ వైష్ణవ్ సహకరించారు. ఎన్ఎండీసీ స్లరీ పైప్ లైన్ కు కేంద్రం అనుమతించడంతో ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రాష్ట్రంలో లక్షన్నర కోట్లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వ లక్ష్యం అభివృద్ధి వికేంద్రీకరణ. క్లస్టర్ బేస్డ్ అభివృద్ధిపై దృష్టిసారించాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే మా ధ్యేయం. అందుకు అనుగుణంగానే అనంతపురం, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలు, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశం జిల్లాలో సీబీజీ, నెల్లూరులో డైవర్సిఫైడ్ ఇండస్ట్రీస్, అమరావతిలో క్యాంటమ్ కంప్యూటింగ్, ఉభయగోదావరి జిల్లాల్లో ఆక్వా, రిఫైనరీ, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైస్, స్టీల్ సిటీ, డేటా సిటీలు ఏర్పాటవుతున్నాయి. ఇందుకు తగ్గట్లుగా ఆయా ప్రాంతాల్లో ఎకో సిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. గూగుల్ 1 గిగావాట్ డేటా సెంటర్, సిఫీ సంస్థ 500 మెగావాట్ల డాటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. పార్టనర్ షిప్ సమ్మిట్ లో 2.7లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5లక్షల ఉద్యోగాలు కల్పించే సంస్థలకు భూమిపూజ చేయబోతున్నాం. ఈ సమ్మిట్ కేవలం ఒప్పందాల కోసమే కాదు...ఏపీ యువత ఆకాంక్షలు నెరవేర్చడమే మా లక్ష్యం. ప్రముఖమైన అన్ని సెక్టార్లలో లీడర్ షిప్ కంపెనీలు ఏపీ వైపు చూస్తున్నాయని తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ డేటా సంస్థలు ఏపీకి వస్తున్నాయి, స్టీల్, అల్యూమినియం, ఏఐ, ఆగ్రిటెక్, డ్రోన్ తదితర అన్నిరంగాల్లో ఏపీని అగ్రగామిగా నిలపాలన్నదే మా ధ్యేయం. విశాఖపట్నంలో నిర్వహించే కార్యక్రమాన్ని మేం ట్రీవే పార్టనర్ షిప్ గా భావిస్తున్నాం. ప్రభుత్వం, ప్రజలు, పారిశ్రామిక సంస్థలు కలిసికట్టుగా ముందుకు సాగితేనే ఆంధ్రప్రదేశ్ అగ్రపథాన పయనిస్తుంది. నిన్న కూడా ముంబయిలో అనేకమంది పారిశ్రామికవేత్తలను కలిశాను. ఇప్పుడు ప్రతిఒక్కరూ ఏపీ వైపు చూస్తున్నారు. అయినా మేం సంతృప్తి చెందడం లేదు. అన్నిరంగాల్లో ఏపీని నెం.1 చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## 143 దేశాలకు గానూ గత ఏడాది 79వ స్థానంలో నిలిచిన భారత్

భారత్ ర్యాంకు ఏటికేడు దిగజారుతూ వస్తున్నది. 2015లో ఓవరాల్ ర్యాంకింగ్స్‌లో భారత్ 57వ స్థానంలో ఉండగా, 2025కి 86వ ర్యాంకుకు దిగజారింది. ఇక అవినీతిరహిత దేశాల జాబితాలో గత ఏడాది 97వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 99వ స్థానానికి చేరింది.మోదీ పాలనలో దేశంలో ప్రజల ప్రాథమిక హక్కులు ఏ స్థితిలో ఉన్నాయో రుజువు చేసేందుకు ఈ ర్యాంకే నిదర్శనం. 2015లో భారత్ 62వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 103వ స్థానానికి పడిపోయింది. చట్టాల అమలు యంత్రాంగం పనితీరులోనూ శాంతి భద్రతల విషయంలో గత ఏడాది 98వ ర్యాంకులో ఉన్న భారత్ ఈ ఏడాది 105వ స్థానానికి పడిపోవడం క్షీణించిన శాంతి భద్రతల పరిస్థితికి అద్దంపడుతుంది. చట్టాల అమలు యంత్రాంగం పనితీరులో గత ఏడాది 78వ ర్యాంకులో ఉన్న భారత్ ఈ ఏడాది 79వ స్థానానికి పడిపోయి మోదీ ప్రభుత్వ వైఫల్యాలను బహిర్గతం చేసింది.

# కవిత రాజకీయ ఎత్తుగడ

## యూటర్న్ తీసుకొని కాంగ్రెస్.. బిజెపిలపై టార్గెట్ చేసిందా..!?

**ఇన్నాళ్లు కుటుంబ సభ్యులపై ఎడాపెడా కామెంట్లు చేసిన కవిత ఇప్పుడు యూటర్న్ తీసుకుందా అన్న అనుమానాలు తెలంగాణలో గుప్పు మంటున్నాయి. కల్వకుంట్ల కవిత అదిలాబాద్ లో పర్యటిస్తూ భక్తి రైతుల కష్టాలను అడిగి తెలుసుకుంది. అంతటితో ఆగకుండా కల్వకుంట్ల కవిత రైతుల పట్ల నాటి బిఆర్ఎస్ పార్టీ ఎంత సుముఖత చూపించిందో పదేపదే పొగుడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మీద సీఎం రేవంత్ రెడ్డి మీద విమర్శలకు పదును పెడుతోంది..**






కడారి శ్రీనివాస్
జయభేరి సీనియర్ జర్నలిస్ట్,
98489 62799
కవి రచయిత, గాయకుడు,
తెలంగాణ ఉద్యమకారుడు,
గిడుగు రామ్మూర్తి అవార్డు గ్రహీత

జయభేరి, హైదరాబాద్ :
ఎందుకిలా జరుగుతోంది అని ఆలోచిస్తే... గతంలో బిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులను పదేపదే ఫలిస్తూ అదిలాబాదులో నీటి ప్రాజెక్టులను మొదలు పెట్టింది మా ప్రభుత్వం అంటూ గులాబీ పార్టీని మళ్లీ తాను తన వైపు మళ్ళించుకుని గులాబీ పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను పదేపదే నెమరు వేస్తోంది.. ఇదే కల్వకుంట్ల కవిత గతంలో దయ్యాలు కోవర్టులు గులాబీ పార్టీలో ఉన్నాయంటూ సొంత కుటుంబీకులపైనే ఘాటు వ్యాఖ్యలు చేసిన కవిత అదిలాబాదు పర్యటనలో పత్తి రైతులను ఉద్దేశిస్తూ కన్నీరు కారుస్తూ తేమ పేరుతో రైతులను మోసం చేస్తున్నారని దీనికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే సమాధానం చెప్పాలని కౌంటర్ వేసింది కల్వకుంట్ల కవిత. అంతటితో ఆగకుండా గులాబీ పార్టీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఆదిలాబాద్ లోని సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి కార్యక్రమాలకు కొనసాగించకుండా అవి పక్కన పెట్టి వదిలేయడం కాంగ్రెస్ ప్రభుత్వం దేనికి సంకేతం అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తోంది. ఇక్కడే అసలైన రాజకీయం ఉంది అని తెలుస్తోంది. ఎందుకంటే కల్వకుంట్ల కవిత యూటర్న్ తీసుకున్నట్టుగా కనిపిస్తోంది. ఎందుకంటే పరిస్థితులు అనుకూలించినప్పుడు తమ గులాబీ పార్టీని ఆ పార్టీ చేసిన అభివృద్ధి పనులను వర్ణిస్తూ స్థానికంగా గులాబీ పార్టీ ఓటర్లను ఆకర్షించుకోవడానికి కల్వకుంట్ల కవిత చేస్తున్న ప్రయత్నం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం కాంగ్రెస్ బిజెపి పార్టీల మీద టార్గెట్ చేస్తూ గులాబీ పార్టీ హయాంలో చేసిన అభివృద్ధి పనులను సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధి ఎంతవరకు జరిగింది కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలా పక్కన పెట్టేశారు అన్న వాటిపై మొసలి కన్నీరు కారుస్తుంది. అంటే యూటర్న్ తీసుకున్న కల్వకుంట్ల కవిత గులాబీ పార్టీ శ్రేణులు తనను అనుకరించాలని ఒక రాజకీయ ఎత్తుగడతో రాజకీయ కోణంలో కల్వకుంట్ల కవిత తన తండ్రి దగ్గర నుంచే రాజకీయ వనమాలు నేర్చుకుంది కాబట్టి తనదైన శైలిలో రాజకీయ ప్రచారంలో భాగంగా ఆదిలాబాద్లో యూటర్న్ తీసుకొని రైతులపై కన్నీరు వలకబోస్తున్నట్టు గులాబీ పార్టీ శ్రేణులను తన వైపు తిప్పుకోవాలని రాజకీయ పావులను కలిపింది కల్వకుంట్ల కవిత... ఎందుకంటే సొంత పార్టీలోనే కోవర్టులు దయ్యాలు ఉన్నాయని కుటుంబ సభ్యులపై అని చూడకుండా ఘాటు వ్యాఖ్యలు చేసిన కల్వకుంట్ల కవిత ఇప్పుడు ఏకంగా కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీని టార్గెట్ చేస్తూ యూటర్న్ తీసుకోవడం రాజకీయ ఎత్తుగడే అని స్పష్టంగా తెలుస్తోంది...

# సమన్వయం

## ఆత్మశాంతి – మార్పు

జయభేరి ఆధ్యాత్మిక శీర్షిక



శంభాలా 360 సొల్యూషన్స్ అనేది లోతైన సమన్వయం, జీవన ఉద్దేశ్యం, ఆత్మపరిమార్పు కోరుకునే వారికి ఒక పవిత్ర ఆశ్రయం. ప్రాచీన శంభాలా శక్తి జ్ఞానంలో పునాది వేసుకుని, డా. హరి హర నాధ రాజు కె కరుణామయ దృష్టితో నడిపించబడుతున్న ఈ సంస్థ, ప్రతి వ్యక్తికి ఆరోగ్యము, ఆత్మ అన్వేషణ, మరియు చైతన్య విస్తరణ దారిని చూపిస్తుంది. అంతర్గత శక్తి మేల్కొలుపు శంభాలా 360 సొల్యూషన్స్ కేవలం చికిత్స గురించి కాదు మనలోని అంతర్గత సామర్థ్యాన్ని మేల్కొలిపి, మన ఉన్నతమైన స్వరూపంతో, విశ్వ శక్తి ప్రవాహంతో సమన్వయంలో జీవించేందుకు సహాయపడుతుంది. ఇది వ్యక్తికి తనలోని శక్తిని గుర్తించేందుకు, స్పష్టతతో, శాంతితో జీవితం నడిపించేందుకు మార్గం చూపుతుంది. శక్తి సమతుల్యత & కర్మ శుద్ధి శక్తి సమతుల్యత ద్వారా, కార్మిక అడ్డంకులను తొలగించడం, తరంగాల (ఫ్రీక్వెన్సీల) సమన్వయం ద్వారా, శంభాలా 360 సొల్యూషన్స్ వ్యక్తిని తన అంతర్గత బలంతో మళ్లీ కలుపుతుంది. ఇది వ్యక్తికి జీవిత సవాళ్లను స్పష్టతతో, ధైర్యంతో, ప్రశాంతతతో ఎదుర్కొనే శక్తిని అందిస్తుంది. పర్యావరణ శక్తి సమన్వయం ఈ సాధన వ్యక్తి స్థాయిని దాటి విస్తరించి, చుట్టూ ఉన్న పర్యావరణ శక్తుల అసమతుల్యతలను సరిచేస్తుంది. భౌగోళిక ఒత్తిడులను తొలగించడం ద్వారా, శాంతి, సమృద్ధి, ఆధ్యాత్మిక ఎదుగుదలకు అనుకూలమైన ప్రదేశాలను సృష్టిస్తుంది. శక్తి, శాంతి, స్వరూపం కలిసే స్థలం.



Dr. హరి హర నాద రాజు
శంబాలా 360 సోలుషన్స్
9177 445 591
www.shambala360solutions.com

## గచ్చిబౌలిలో రేవ్ పార్టీ

### స్మగ్లర్లు అరెస్ట్.. కర్ణాటక లింక్!

కర్ణాటక నుంచి డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్ యువకులకు అమ్ముతున్న ప్రధాన స్మగ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ప్రధాన నిందితుడు గుత్తా తేజ కృష్ణ తో పాటు ఒక నైజీరియన్ దేశస్థుడిని కూడా ఎస్ఓటీ అరెస్ట్ చేసింది. వీరు కర్ణాటక నుంచి డ్రగ్స్ తెచ్చి హైదరాబాద్ నగరంలో సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అరెస్ట్ అయిన 12 మందిలో ముఖ్యులుగా గుర్తించిన వారి వివరాలు: గుత్తా తేజ కృష్ణ (ప్రధాన స్మగ్లర్), నైజీరియన్ దేశస్థుడు (పేరు తెలియాల్సి ఉంది), సాజీర్, వెన్నెల రవి కిరణ్, మన్నే ప్రశాంత్, పి. హర్షవర్ధన్ రెడ్డి, పకనాటి లోకేష్ రెడ్డి, పృథ్వీ విష్ణువర్ధన్, కార్ల పొడి వెస్లీ సుజిత్, గుండబోయిన నాగార్జున, మేకల గౌతం, గుంటక సతీష్ రెడ్డి. ఈ కేసుపై మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఓటీ అధికారులు తెలిపారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌లో ఉన్న మిగిలిన వారిని కూడా త్వరలో పట్టుకుంటామన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలు కాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ఈ సందర్భంగా హెచ్చరించారు.ముషిరాబాద్ లో డాక్టర్ ఇంట్లో డ్రగ్స్ డెన్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

### ఇంట్లోనే దుకాణం పెట్టిన డాక్టర్

హైదరాబాద్ నగరంలోని ఓ డాక్టర్ ఇంట్లో పోలీసులు డ్రగ్స్ పట్టుకోవడం కలకలం రేపింది. డ్రగ్స్ వ్యాపారానికి తెరతీసిన డాక్టర్ .. స్నేహితులతో కలిసి ఇంట్లో నుంచే అమ్మకాలు జరుపుతున్నాడు.. పక్కా సమాచారంతో దాడి చేసిన ఎక్సైజ్ STF పోలీసులు.. డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. 15 గ్రాముల LSD బోల్ట్, 1.32 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌లో అద్దెకు ఉంటున్న జాన్‌పాల్ అనే వైద్యుడు.. ఇంట్లోనే డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది.దీంతో ఎక్సైజ్ STF పోలీసులు .. అక్కడికి చేరుకుని.. అతని నివాసంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రూ.3 లక్షల విలువ చేసే డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ పోలీసులు తెలిపారు. జాన్‌పాల్‌ను అరెస్టు చేసి ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# కవిత ప్లాన్ మాములుగా లేదుగా..

- తెలంగాణ జాగృతినే పార్టీగా మారుస్తారని ప్రచారం
- సొంత కుంపటి కోసం గ్రౌండ్ ప్రిపేర్
- ఖైరతాబాద్ బైపోల్ రావొచ్చని అంచనా
- రానున్న స్థానిక ఎన్నికలే కవితకు తొలి టార్గెట్
- భారీగా ఓట్లు చీల్చి తమ సత్తా చాటే ప్రయత్నం
- బీఆర్ఎస్ టార్గెట్గా జనాల్లోకి వెళ్తున్న కవిత

**జయభేరి, నిజామాబాద్, నవంబర్ 4:**



జాగృతి జనం బాటతో ప్రజల్లోకి వెళ్తున్నా ఎమ్మెల్సీ కవిత వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో కీరోల్ పోషించేలా సరికొత్త ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సొంత కుంపటి కోసం గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటున్న కవిత.. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు జిల్లాల పర్యటన పెట్టుకున్నారు. వచ్చే ఏడాది మార్చి లేకపోతే ఏప్రిల్లో కవిత పార్టీ పెడుతారని.. ఇప్పుడున్న తెలంగాణ జాగృతినే పార్టీగా మారుస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే వచ్చే ఏప్రిల్లో తాను పార్టీ రిజిస్టర్ చేసి.. ఎన్నికల గుర్తు వచ్చేలోపు చాలా ఎన్నికలు వస్తాయని లెక్కలు వేసుకుంటోందట కవిత. ఖైరతాబాద్ బైపోల్ రావొచ్చని అంచనా వేస్తున్నారట. అలాగే లోకల్ బాడీ పోల్స్.. గ్రేటర్ ఎన్నికలు కూడా జరిగే అవకశాలున్నాయి. దీంతో ఈ అన్ని ఎన్నికల్లో కూడా పోటీ చేయాలని కవిత భావిస్తున్నారట. జాగృతి ఇంకా పార్టీగా ఆవిర్భవించకపోవడంతో



పాటు పార్టీ గుర్తు కూడా లేకపోవడంతో ఆల్టర్నేట్ ఆప్షన్స్ మీద ఫోకస్ పెట్టారట కవిత. భవిష్యత్ జరిగే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ గుర్తుపై తన అభ్యర్థులను బరిలోకి దింపాలని చూస్తున్నారట కవిత. ఆల్ ఇండియా పార్వర్డ్ బ్లాక్ పార్టీ.. రాష్ట్రంలో రెబల్స్కు కేరాఫ్ గా ఉంటుంది. ప్రధాన రాజకీయ పార్టీల నుంచి టికెట్ దక్కని నేతలు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై పోటీ చేసి.. టికెట్ ఇవ్వని పార్టీలకు సవాల్ చేస్తుంటారు. భారీగా ఓట్లు చీల్చి తమ సత్తా చాటే ప్రయత్నం చేస్తుంటారు. గత ఎన్నికల్లో రామగుండం బీఆర్ఎస్ రెబల్గా పోటీ చేసిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సింహం గుర్తుపై పోటీ చేసి గెలుపొందారు. లోకల్ బాడీ ఎన్నికల్లోనూ ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థులు సత్తా చాటారు. నేతాజి సుభాష్ చంద్రబోస్ ఐడియాలజీతో పురుడు పోసుకున్న పార్టీ కావడం.. ఆ పార్టీ సింబల్ సింహం గుర్తు కావడంతో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతుంటారు నేతలు. ఇప్పుడు బీఆర్ఎస్ టార్గెట్గా జనాల్లోకి వెళ్తున్న కవితకు సింహం తోడైతే రాజకీయాల్లో గర్జించడం ఇంకా ఈజీ అవుతుందని లెక్కలు వేస్తున్నారట జ్యోతిష్యులు. రెబల్స్ కు కేరాఫ్గా ఉన్న ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి కవిత లాంటి కరిజ్మా లీడర్ తోడైతే ఆ పార్టీకి జన బలం పెరిగే ఛాన్స్ ఉండగా.. కవితకు కూడా ఆ పార్టీ సింబల్ కలిసి వస్తుందని భావిస్తున్నారట. అయితే సెంటిమెంట్, జాతకాలను విశ్వసించే కవితకు... సింహం గుర్తు పొలిటికల్ గా కలిసి వస్తుందని జ్యోతిష్యులు, పండితులు కూడా చెప్పారట. అందుకే సింహం సింబల్ తో ప్రచారం సాగించాలనుకుంటున్నారట. ఇప్పటికే ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నేతలు.. ఓ సింగరేణి కార్మిక సంఘ నాయకుడి మధ్యవర్తిత్వంతో కవితతో భేటీ అయినట్లుగా ప్రచారం జరుగుతుంది. కవితకు మెజారిటీ సీట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తుండగా చర్చలు మాత్రం ఓ కొలిక్కి రాలేదట. అన్నీ అనుకున్నట్లు జరిగితే రానున్న స్థానిక ఎన్నికలే కవితకు తొలి టార్గెట్ అవడం ఖాయం.

## న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలి

- బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అభ్యర్థి శ్రీనివాస్ రావు

**జయభేరి, యాదగిరిగుట్ట :**



న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని మందడపు శ్రీనివాస్ రావు పిలుపునిచ్చారు యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ నిరంతరం అడ్వకేట్ లపై దాడులు జరుగుతున్నాయని వెంటనే రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా లాయర్ యూనియన్ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ 2019 సంవత్సరం తర్వాత బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్రంలో నమోదు చేసుకున్న న్యాయవాదులకు హెల్త్ కార్డులు లేవని వెంటనే హెల్త్ కార్డులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. విశాఖ జడ్జిమెంట్ ప్రకారం మహిళా న్యాయవాదులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొల్లెపల్లి కుమార్ యాదగిరిగుట్ట బార్ అసోసియేషన్ అధ్యక్షులు సూదగాని శ్రీహరి, కార్యదర్శి ఐరేని కృష్ణ,జి సాయి కృష్ణ, ఆలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వనం రాజు, కృష్ణ, రేణుక, పెంట రమేష్, జిల్లా కార్యదర్శి చింతల రాజశేఖర్ రెడ్డి, ఎండి నిహాల్, జిట్ట భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలి

- ఎమ్మెల్యే, ఎంపీల కార్యాలయాలను ముట్టడిద్దాం
- ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 04 :**

రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని విడనాడి వెంటనే నిధులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ డిమాండ్ చేశారు. రేపు, తేదీ 5112025 న రాష్ట్ర ఆదేశాల మేరకు విద్యార్థి సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేలు, మంత్రుల కార్యాలయాలను ముట్టడించే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాదాపు ₹8500 కోట్లకు పైగా స్కాలర్షిప్ మరియు ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు పెండింగ్లో ఉన్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు తమ చదువు కొనసాగించడానికి, ఫీజులు చెల్లించడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణం స్పందించాలి, లేనిపక్షంలో విద్యార్థి సమాజం తీవ్ర ఆందోళనకు దిగుతుందని ఆకాష్ నాయక్ హెచ్చరించారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమాన్ని ప్రాధాన్యంగా తీసుకోవాలని, పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

## బిచ్చగాళ్లు అప్డేట్ అయ్యారోచ్

**జయభేరి, నల్గొండ:**

అడుక్కునే బిచ్చగాళ్లు అప్డేట్ అయ్యారు. ఇప్పుడు స్కానర్లు పెట్టుకొని.. దానం చేయండి బాబూ అంటున్నారు. ఈ దృశ్యం మచ్చగిరి లక్ష్మీనరసింహస్వామి గుట్టపై చోటు చేసుకుంది. బిచ్చం అడిగితే అందరూ చిల్లర లేవు.. ఫోన్ పే, గూగుల్ పే ఉంది" అని చెప్తున్నారని ఒక బిచ్చగాడు ఫోన్ పే స్కానర్ పట్టుకొని అడుక్కుంటున్నాడు.

## ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీను నాయక్

**జయభేరి, షాద్ నగర్, నవంబర్ 04 :**



గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు షాద్నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గత రెండు రోజుల నుంచి జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులలో రంగారెడ్డి జిల్లా రిపోర్టును శ్రీను నాయక్ ప్రవేశ పెడుతూ మాట్లాడారు; భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు 12 వేల రూపాయలను పూర్తిస్థాయిలో ఇవ్వాలని మహిళలకు నెలకు 2500 ఇవ్వాలని, వృద్ధాప్య పెన్షన్లు 2000 నుంచి 4000 పెంచాలని గ్రామాలలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలం ఇచ్చి ఇంద్రమ్మ ఇల్లు కట్టివాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పై ఐక్య పోరాటాలు నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించే విధంగా పోరాడుతామని అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై తమ సంఘంలో నిరంతర పోరాటాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు..

## పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి

- తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

**జయభేరి, గార్ల, నవంబర్ 4:**



మెంథా తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి,తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సిపిఐ (ఎం ఎల్ ) న్యూడెమోక్రసీ గార్ల మండల కార్యదర్శి జి.సక్రు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తేమ శాతంతో సంబంధం లేకుండా మార్కెట్ కు వచ్చిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని,ఇసుక మేటలు వేసిన భూములను చదును చేసి సేద్యానికి అనుకూలంగా మార్చే విధంగా ఖర్చులను అంచినా వేసి ప్రభుత్వమే పరిహారాన్ని అందజేయాలని కోరారు.ఆరుగాలం శ్రమించిన మొక్కజొన్న రైతు నష్టాల పాలవుతున్నారని సకాలంలో పంట చేతికొచ్చిన అకాల వర్షాలతో కల్లాల్లో తడిసి ముద్దవుతున్నాయని మార్క్ఫెడ్ ఆధ్వర్యంలో కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకపోవడంతో రైతన్నలు దళారులను ఆశ్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి, మొక్కజొన్న పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు 30 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వీరభద్రం, గణేష్, మాన్య, రవి, భద్రాజి, గురువయ్య,మహేష్ బాబు, కొండలరావు, రుక్మారావు తదితరులు పాల్గొన్నారు.




## బాల్య వివాహాలు, అక్రమ దత్తతపై అవగాహన

**జయభేరి, దేవరకొండ :**

ఐసిడిఎస్ ప్రాజెక్టు దేవరకొండ మండల పరిధిలోని బన్యబావోజితండఅంగన్వాడి కేంద్రం నందు బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది, ఈ కార్యక్రమంలో సంబంధిత సూపర్వైజర్ డి చిట్టెమ్మ,18 సంవత్సరాలు నిండే వరకు ఆడపిల్లలకు పెళ్లి చేయకూడదని, బాల్యవివాహాలు జరుగుతే 1098కు హెల్ప్ లైన్ కు ఫోన్ చేయగలరని బాలికలను బాగా చదివించి బంగారు భవిష్యత్తుకు పునాది వేయాలని తెలియపరచడమైనది..

**అక్రమ దత్తత చట్టరీత్యా నేరం**

శిశువిక్రయాలు జరుగుతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని బ్రూణ హత్యలు, లింగ వివక్షత చూపకూడ పుట్టిన ప్రతి బిడ్డను ఉన్నతమైన చదువులు చదివించాలని తల్లులకు తెలియపరచడమైనది ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ పద్మ , అంగన్వాడీ టీచర్స్ దాసిలి,సువర్ణ, గ్రామస్తులు లచ్చిరాం, కిషన్, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల చలో హైద్రాబాద్ ధర్నా విజయవంతం చేయాలి




**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ వారికి 1.హెల్త్ కార్డుపై అన్ని కార్పొరేట్ హాస్పిటల్స్ నందు క్యాష్ లెస్ వైద్య సదుపాయం కలిపించాలి, 2. 5 విడతల కరువు భత్యం మంజూరు చేసి, నగదుగా అందజేయాలి, 3. పే రివిజన్ కమిషన్ అమలు చేయాలి. 4. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు రావాలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందజేయాలి.వీటి సాధన కొరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ఆదేశం మేరకు ఈ నెల 7వ తేది చలో హైద్రాబాద్ భాగముగా ఇందిరాపార్క్ వద్ద మహా ధర్నా కార్యక్రమంలో దేవరకొండ యూనిట్ నుండి అధిక సంఖ్యలో పాలుగోని విజయవంతం చేయగలరని కోరుతూ ధర్నా పోస్టర్ ఆవిష్కరణ అధ్యక్షులు తాడిశెట్టి నరసింహ,కార్యదర్శి అంకం చంద్రమౌళి,జిల్లా కార్యదర్శి కంచర్ల నారాయణ రెడ్డి, సహ అధ్యక్షులు గంగిడి దామోదర్ రెడ్డి, కోశాధికారి పంగనూరు లింగయ్య,ఉపాధ్యక్షులు ఆకులపల్లి ఐజాక్,సంయుక్త కార్యదర్శి వనం బుచ్చయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్,జిల్లా కౌన్సిలర్ తాడిశెట్టి సుదర్శన్ కార్యవర్గ సభ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు టై బెల్టుల వితరణ



**జయభేరి, గార్ల, నవంబర్ 4:**

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి మంచి జ్ఞానాన్ని పొంది ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని మాచర్ల(రెబ్బ) కళ్యాణి అన్నారు.మండల పరిధిలోని స్థానిక బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 120 మంది విద్యార్థులకు మంగళవారం ఇల్లెందుకు చెందిన ఎన్ఆర్ఐ రెబ్బ శ్రీనివాస్ సహకారంతో పదివేల రూపాయల విలువ గల టై, బెల్టులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి చదివి క్రమశిక్షణకు మారుపేరుగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకొని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవులపల్లి సత్యనారాయణ, మాచర్ల సుందర్ కుమార్, వెంకటేశ్వరరావు, మంజుల, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహస్వామి, అబ్దుల్ ఖాదీర్, మంగయ్య, రజిని, లావణ్య, అశ్విని, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

## కిడ్నాప్ కేసులో 10 మంది అరెస్ట్

**జయభేరి, హైదరాబాద్ :**

అంబర్పేట్ డీడీ కాలనీలో గత నెల 29వ తేదీన చోటుచేసుకున్న కిడ్నాప్ కేసును అంబర్పేట్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో పాలుపంచుకున్న 10 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి తెలిపారు. మంత్రి శ్యామ్ అనే వ్యక్తిని కిడ్నాప్ చేసి రూ.1.5 కోట్ల రూపాయలు డిమాండ్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితుల వద్ద నుంచి మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆరుగురు నిందితులు శ్యామ్ను అపహరించారని పోలీసులు గుర్తించారు. వారు రెంట్ కార్లలో ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ప్రధాన నిందితురాలు మాధవీలత అమెరికాలో మంత్రి శ్యామ్తో వివాహం చేసుకొని మూడు సంవత్సరాల వ్యవధిలోనే విడాకులు పొందింది. గత మూడు సంవత్సరాలుగా ఆమె భర్తకు దూరంగా ఉంది. బాధితుడు శ్యామ్ తన పేరును 'అలి'గా మార్చుకొని ఫాతిమా అనే మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. శ్యామ్ తండ్రి నుంచి వచ్చిన రూ.20 కోట్ల విలువైన ఆస్తిని విక్రయించినట్లు సమాచారం. ఈ గ్యాంగ్ ప్రధాన సూత్రధారి సాయి అనే వ్యక్తి రామనగర్ ప్రాంతానికి చెందినవాడని పోలీసులు తెలిపారు. మరో నిందితురాలు జీ.ప్రీతి లేడీ బౌన్సర్గా పనిచేస్తుండగా, ఎల్.సరిత అనే మరో మహిళ బాధితుడు ఉన్న అపార్ట్మెంట్లోనే ఘటనకు రెండు రోజుల ముందు నివసించి, అతని కదలికలపై నిఘా పెట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు. బాధితుడిని చెర్లపల్లి ప్రాంతానికి తీసుకెళ్లి రెండు ప్రదేశాల్లో తిప్పుతూ రూ.30 లక్షలు డిమాండ్ చేసినట్లు విచారణలో తేలింది. బాధితుడు డబ్బులు సర్దుబాటు చేసుకోవడానికి తన స్నేహితుడికి ఫోన్ చేయగా, ఆ స్నేహితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. శ్యామ్ తెలివిగా తప్పించుకుని పోలీసులకు వివరాలు తెలియజేశాడు.కేసు నమోదు చేసిన పోలీసులు 10 మందిని అరెస్ట్ చేశారు. కేసులో మిగిలిన నలుగురిని త్వరలో పట్టుకుంటామని డీసీపీ బాలస్వామి తెలిపారు.

**2025 కార్తీక పూర్ణిమ హిందువులు జరుపుకునే పెద్ద పండుగ. ఈ పండుగ రోజు శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేస్తారు. దేశ వ్యాప్తంగా ఉన్న శివాలయాలు శివనామస్మరణతో మార్మోగుతాయి. ఈ పూర్ణిమ గురించి ప్రాచీన గ్రంథాలలో అనేక విధాలుగా అభివర్ణించారు. ఈ పూర్ణిమ రోజున పరమ శివుడు త్రిపురాసురుడు అనే రాక్షసుడిని సంహరించినట్లు మనకు పురాణాల ప్రకారం చెప్పబడింది. అందుకోసమనే ఈ పూర్ణిమను త్రిపురి పూర్ణిమ అని కూడా పిలుస్తారు. ఈ పూర్ణిమ రోజు భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పరమ శివుడికి దీపారాధన చేస్తారు. శివుడు ఆ రాక్షసుడి భారి నుంచి ప్రజలను విముక్తులను చేయడంతో ఈ పండుగను చాలా పెద్ద ఎత్తున జరుపుకుంటారు.**



ఈ పండుగ ఈ సంవత్సరం నవంబర్ 5న బుధవారం రోజు వస్తుంది. ఈ పండుగ రోజు కొంత ది హిందువులు కార్తీక పౌర్ణమి నోమును కూడా నోచుకుంటారు. ఈ నోములో గౌరీ దేవీ, లక్ష్మీనారాయణుల్ని, తులసీ దామోదరులను పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నోమును కొద్ది మంది హిందువులు మాత్రమే జరుపుకుంటారు. ఈ కార్తీక పౌర్ణమి రోజు చాలా మంది టపాసులు కాల్చుతూ తమ ఆనం దాన్ని వ్యక్తం చేస్తారు. కార్తీక మాసంలోని శుక్ల పక్షంలో వచ్చే పౌర్ణమిని కార్తీక పౌర్ణమిగా వ్యవహరిస్తారు. ఈ కార్తీక పౌర్ణమి పండుగ ఐదు రోజుల పాటు జరుగుతుంది. ఈ పండుగ ప్రభో దిని ఏకాదశి రోజున ప్రారంభమవుతుంది. మరియు కార్తీక పౌర్ణమి రోజున ముగుస్తుంది.





పూర్ణిమ దేవతలను సంతోష పెట్టడానికి ఒక ప్రధాన రోజు. ఈ రోజు అనేక మంది తమకు తోచిన దానాలను ఇస్తారు. అలాగే దీపాలను కూడా దానం చేస్తారు. ఇలా చేయడం వలన పుణ్య ఫలం సిద్ధిస్తుందని వారు నమ్ముతారు. అందుకోసమే కార్తీక పౌర్ణమి రోజున మనం ఏ దేవాలయాలు చూసినా ఇసుకేస్తే రాలనంత జనాలతో కిక్కిరిసి పోయి ఉంటాయి. ఇలా కార్తీక పౌర్ణమిని భక్తులు అధిక భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారు. అనేక మంది హిందూ భక్తులు కార్తీక వ్రతాలు కూడా పడతారు. వీరు ఈ వ్రతాలను పౌర్ణమి గడియలు ముగిసిన తర్వాత దేవుడికి పూజలు చేసి వదిలేస్తారు.

**కార్తీక పౌర్ణమి రోజు ఎలా పూజ చేయాలంటే:**

కార్తీక పౌర్ణమి రోజున ఎలా పూజ చేయాలని చాలా మంది భక్తులు వెయిట్ చేస్తారు. ఎటువంటి పూజలు చేస్తే దేవుడికి మనం చేసేది నచ్చుతుందనే విషయంలో తర్జన భర్జన పడతారు. ఎవరికి తోచిన విధంగా వారు పూజలను అనుసరిస్తారు. అసలు కార్తీక పౌర్ణమి పూజా విధానం గురించి పురాణాల్లో ఏమని చెప్పారంటే.. కార్తీక పౌర్ణమి రోజున ఉదయాన్నే లేచి నదీ స్నానం చేయడం మంచిది. ఎటువంటి వారైనా సరే ఈ రోజు నదీ స్నానం చేయడం కోసం అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. అటు తర్వాత నెయ్యితో దేవుడికి వెలిగించండి. వీలైతే ఉపవాసం ఉండడం కోసం ప్రయత్నించాలి. ఉపవాసాలు చేయడం చాలా రోజుల నుంచి ఆనవాయితీగా వస్తోంది.

కార్తీక పౌర్ణమి పర్వదినాన సత్యనారాయణ స్వామి కథను వినడం వలన మంచి జరుగుతుందని చాలా మంది విశ్వసిస్తారు. కావున మీరు కూడా కార్తీక పౌర్ణమి రోజు సత్యనారాయణ స్వామి కథను వినేందుకు ఎక్కువగా ప్రయత్నించండి. మీకు సత్యనారాయణ స్వామి కథను వినడం వీలు కాకపోతే మరేం చేయలేరు. కార్తీక పౌర్ణమి రోజు సాయంత్రం పూట లక్ష్మీ నారాయణులకు హారతి ఇవ్వండి. ఇలా చేయడం ద్వారా మీకు సకల సంతోషాలు కలుగుతాయి. ఈ రోజు కేవలం నెయ్యితో మాత్రమే దీపాన్ని పెట్టండి. అంతే కాకుండా సాయంత్రం





**కార్తీక మాసంలో తులసి పూజ, ఉసిరికాయ దీపాలు**


కార్తీక మాసములో వచ్చే పౌర్ణమి అత్యంత మహిమాన్వితమైనదని పురాణాలు చెపుతున్నాయి. ఈ పౌర్ణమి రోజున శివాలయాల్లో రుద్రాభిషేకం చేయించిన వారికి సకల సంపదలు దరి చేరుతాయి. ఇందులో భాగంగా... మహాన్యాసక పూర్వక రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకాలను చేయించినట్లైతే... కోటి జన్మల పుణ్య ఫలం ప్రాప్తిస్తుందని విశ్వాసం. అంతే కాకుండా పౌర్ణమి రోజున కేదారేశ్వర వ్రతమును చేసినట్లయితే శుభం చేకూరుతుంది. ఈ రోజున సన్నిహితులకు కార్తీక పురాణ పుస్తకాలను శుభాకాంక్షలు (సినిమా) తెలుపుతూ అందజేయటం వలన పుణ్యం లభిస్తుంది. మహిళలు తమ సౌభాగ్యం కోసం పసుపు, కుంకుమ, పుష్పము, తాంబూలాలతో పాటు కార్తీక పురాణ పుస్తకాలను దానంగా ఇవ్వడం చాలా మంచిది. ఇంకా దేవాలయాల్లో సహస్ర లింగార్చన, మహా లింగార్చనలు చేసిన వారికి సర్వశుభాలు ప్రాప్తిస్తాయని పురాణ వచనం. ఏ నది తనకు దగ్గరలో వుంటే ఆ నదిలో ప్రాతఃకాలమున స్నానము చేయవలయును. ఒకవేళ నదులు అందుబాటులో లేనప్పుడు నూతి దగ్గరగాని, చెరువునందు గాని స్నానము చేయవచ్చును. అప్పుడు యీ క్రింది శ్లోకమును చదివి మరీ స్నానమాచరించవలెను.

**శ్లో|| గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి**
**నర్మదే సింధు కావేరి జలే...... స్మిన్ సన్నిధింకురు||**

**కార్తీక పూర్ణిమ ముఖ్యమైనది:**

మనకు వచ్చే హిందూ పండుగల్లో కార్తీక పూర్ణిమ చాలా ముఖ్యమైనది. అందుకోసమే కార్తీక పూర్ణిమ రోజు హిందువులు నదీ స్నానం చేసేందుకు ఎక్కువ ఆసక్తిని చూపుతారు. నదీ స్నానం చేయడం వలన అనేక పాపాలు తొలిగిపోతాయని హిందువులు నమ్ముతారు. నదీ స్నానం వీలు కాని హిందువులు చివరకు నీటి తొట్టెలో అయినా స్నానం చేసి తమ పాపాలను ప్రాయాశ్చితం చేసుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపిస్తారు. ఈ కార్తీక పూట తులసి కోటలో నెయ్యితో దీపాన్ని వెలిగించడం మర్చిపోకండి. తులసి దేవికి పూజించడం వలన సంతోషాలను మీ నుంచి ఎవరూ దూరం చేయకుండా ఉంటారు. కార్తీక పౌర్ణమి రోజు దానాలు చేయడం చాలా మంచిది. ఇలా మీరు కూడా ఎవరికైనా సరే ఆకలితో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టి పుణ్యాన్ని మూటగట్టుకోండి. కార్తీక పౌర్ణమి రోజు మాత్రం దీపాలను వెలిగించకుండా ఉండొద్దు.

తులసీ మాత కార్తీక పౌర్ణమి రోజే భూమి మీదకు వచ్చిందని మనకు అనేక పురాణాల్లో చెప్పడంతో పాటు అనేక మంది భక్తులు కూడా విశ్వసిస్తారు. కావున తులసీ మాతకు తప్పకుండా పూజ చేయండి. తులసీ మాతకు పూజ చేసేటపుడు గంగా జలాన్ని మాత్రం మరువద్దు. తులసీ మాతను ఈ రోజు విష్ణువుకు సమర్పించడం వలన మీకు అనేక భోగ బాగ్యాలు కలుగుతాయి. కావున తులసీ మాతను విష్ణు దేవుడికి అర్పించండి. అంతే కాకుండా మరో విషయం కూడా గుర్తుంచుకోవాలి. ఈ రోజు ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలు కట్టడం మాత్రం మర్చిపోవద్దు. ఇలా ఇంటి గుమ్మానికి మామిడి తోరణాలను అలంకరించడం చాలా బాగుంటుంది. అలాగే శివుడి మీద తేనే మరియు గంగాజలాన్ని కలిపి అభిషేకం చేయాలి. ఈ రోజు సాయంత్రం దీపారాధన చేయడం మాత్రం చాలా ముఖ్యం. దీపదానం చేయడం వలన లక్ష్మీ దేవి చాలా సంతోషిస్తుంది. లక్ష్మీ దేవి కటాక్షం అనేది ప్రతి ఒక్కరికి చాలా అవసరం. ఈ రోజు పసుపు పూసిన ఒక నాణాన్ని ఎరుపు రంగు వస్త్రంలో చుట్టి భద్రంగా ఉంచుతారు. ఇలా చేయడం మంచిదని అందరూ భావిస్తారు. ఇలా చేయడం వలన కుటుంబంలో సంపదలు పెరిగి అందరూ ఆరోగ్యంగా ఉంటారని పలువురి నమ్మకం. ఇలా ఈ కార్తీక పౌర్ణమి రోజు మీరు మీ ఇంటిని అందంగా అలంకరించుకోవడమే కాకుండా పూజలు కూడా చేసి ఆ దేవుడి కృపకు పాత్రులు కండి. కావున అందరూ కార్తీక పౌర్ణమి రోజున సంతోషంగా గడపండి.



# బ్రహ్మగిరి గుహల్లో శోధన

హీరో నాగచైతన్య ప్రస్తుతం ఓ మిథికల్ థ్రిల్లర్ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'ఎన్‌సీ24' వర్కింగ్ టైటిల్‌తో రూపొందిస్తున్న ఈ చిత్రానికి 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు దర్శకుడు. మీనాక్షి చౌదరి కథానాయిక. శ్రీవెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో కథానాయిక మీనాక్షి చౌదరి ఆర్కియాలజిస్ట్ దక్ష పాత్రలో కనిపించనుంది. మంగళవారం ఆమె ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. గుహ మధ్యలో కూర్చొని పురాతన వస్తువులను పరిశీలిస్తున్న విజువల్స్ ఆసక్తిని రేకెత్తించేలా ఉన్నాయి. కథాగమనంలో దక్ష పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని, ధైర్యసాహసాలు కలబోసిన మహిళగా ఆమె కనిపిస్తుందని మేకర్స్ తెలిపారు. బ్రహ్మగిరి అనే గుహల్లో నిధుల వేట నేపథ్యంలో సాగే థ్రిల్లర్ కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ఈ చిత్రానికి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, సమర్పణ: బాపినీడు, దర్శకత్వం: కార్తీక్ దండు.

# జాతీయ అవార్డుల్లో పక్షపాతం

**మమ్ముట్టికి అలాంటి అవార్డులు అవసరం లేదు**
**ప్రకాశ్‌రాజ్ సంచలన వ్యాఖ్యలు**



జాతీయ అవార్డులపై ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో జ్యూరీ సభ్యులు రాజకీయ ఒత్తిళ్లతో రాజీపడుతున్నారని పేర్కొన్నారు. సోమవారం 55వ కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులను ప్రకటించిన విషయం తెలిసిందే. 'భ్రమయుగం' చిత్రానికిగాను సీనియర్ నటుడు మమ్ముట్టి ఉత్తమ నటుడిగా అవార్డుకు ఎంపికయ్యారు. ఈ ఏడాది ఏర్పాటు చేసిన కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్ జ్యూరీకి చైర్మన్‌గా ఉన్నారు ప్రకాష్‌రాజ్. అవార్డుల ప్రకటన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ అవార్డుల గురించి ఆయన మాట్లాడారు. వాటిలో పారదర్శకత లోపించిందన్నారు. 'జాతీయ అవార్డులను రాజీపడి ఇస్తున్నారని చెప్పడానికి నేను భయపడను. కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్ చైర్‌పర్సన్‌గా ఉండటం చాలా ఆనందంగా ఉంది. ఈ బాధ్యతను అప్పగించే ముందు కేరళ కమిటీ వాళ్లు నాకు ఫోన్ చేసి 'అనుభవజ్ఞులైన బయటి వ్యక్తులు కమిటీకి నేతృత్వం వహించాలని మేము భావిస్తున్నాం. మేం అవార్డుల విషయంలో ఏమాత్రం జోక్యం చేసుకోము' అని చెప్పారు. అవార్డుల పట్ల వారి నిజాయితీ నన్ను ఆకట్టుకుంది. అందుకే ఈ బాధ్యత స్వీకరించా. అయితే జాతీయ అవార్డుల విషయంలో మాత్రం ఇలా జరగడం లేదు. కమిటీ పక్షపాతం కారణంగా యోగ్యతలేని వాళ్లను అవార్డులు వరిస్తున్నాయి. అలాంటి ప్రభుత్వం, జ్యూరీ అవార్డులను శాసిస్తున్నప్పుడు మమ్ముట్టిలాంటి గొప్ప నటులకు జాతీయ అవార్డులు అవసరం లేదనిపిస్తున్నది' అని ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. ఆయన కామెంట్స్ దేశవ్యాప్తంగా సినీ వర్గాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి. మలయాళ అగ్ర నటుడు మమ్ముట్టి ఇప్పటికి మూడుసార్లు జాతీయ అవార్డులను అందుకున్నారు. గత కొన్నేళ్లుగా జాతీయ అవార్డుల విషయంలో ఆయన్ని ఉద్దేశ్యపూర్వకంగా పక్కనపెడుతున్నారని, గొప్ప చిత్రాల్లో నటించినప్పటికీ అవార్డులను నిరాకరిస్తున్నారని మమ్ముట్టి అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు.

# టాలీవుడ్‌ను ఏలుతోన్న స్టార్ హీరోయిన్..



సినిమాల సంగతి పక్కన పెడితే ఈ హీరోయిన్‌కు లవ్ స్టోరీలు, బ్రేకప్పులు ఎక్కువే. విరాట్ కోహ్లీ, అబ్దుల్ రజాక్ వంటి స్టార్ క్రికెటర్లతోనూ ఈ ముద్దుగుమ్మ ప్రేమాయణం నడిపిందని రూమర్లు వచ్చాయి. అలాగే కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ తోనూ డేటింగ్ చేసిందని ప్రచారం జరిగింది. ఇక ఓ బాలీవుడ్ నటుడితో బహిరంగంగానే చెట్టపట్టాలేసుకుని తిరిగింది ముద్దుగుమ్మ. అయితే ఇప్పుడు ఆ లవ్ కూడా బ్రేకప్ అయ్యింది. ఈ పాటికే అర్థమై ఉంటుంది.. మనం ఎవరి గురించి మాట్లాడుకుంటున్నామో? యస్.. తను మరెవరో కాదు మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా. ఈ ఏడాది ఇప్పటికే రెండు సినిమాల్లో నటించింది తమన్నా. ఓదెల 2లో మెయిన్ లీడ్ లో మెరిసిన ఆమె బాలీవుడ్ రైడ్ 2లో ఓ స్పెషల్ సాంగ్ చేసింది. ప్రస్తుతం ఈ మిల్కీ బ్యూటీ చేతిలో అరడజనుకు పైగా సినిమాలున్నాయి.

# ఏంది రష్మిక.. అసలు చిక్కులా లేవుగా..



ది గర్ల్‌ఫ్రెండ్ సినిమా నాన్ థియేట్రికల్ హక్కులు రూ. 21 కోట్ల భారీ ధరకు అమ్ముడుపోయాయని తెలుస్తుంది. ఇందులో ప్రముఖ ఓటీటీ డిజిటల్ రైట్స్‌కు ఏకంగా రూ. 14 కోట్లు చెల్లించింది. ఇది రష్మికకు ఉన్న పాన్ ఇండియా అప్పీల్‌ను.. ముఖ్యంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో ఆమె కంటెంట్‌కు ఉన్న గిరాకీని తెలియజేస్తుంది. అలాగే శాటిలైట్ హక్కుల ద్వారా రూ. 4 కోట్లు, ఆడియో రైట్స్ రూపంలో రూ. 3 కోట్లు లభించడం రష్మిక క్రేజ్ ఏంటో చూపించాయి. మార్కెట్‌లో ఆమె బ్రాండ్ వాల్యూకు ఈ బిజినెస్ ఓ నిదర్శనం. ఒక హీరోయిన్ ఓరియెంటెడ్ సినిమాకు ఈ రేంజ్ బిజినెస్ మాటలు కాదు. ఈ అద్భుతమైన బిజినెస్ వెనుక రష్మిక క్రేజ్‌తో పాటు గీతా ఆర్ట్స్ వంటి పెద్ద నిర్మాణ సంస్థ బ్యానర్ వాల్యూ కూడా బాగా కలిసి వచ్చింది. అల్లు అరవింద్ సమర్పణలో సినిమా వస్తుండటం, ప్రొడక్షన్ పరంగా ఉన్న నమ్మకం, క్వాలిటీ.. ఇలాంటి అంశాలన్నీ కలిపి నాన్ థియేటర్ రేంజ్ పెంచేసాయి. అయినప్పటికీ హీరోయిన్‌గా రష్మిక ఉండటం అనేది ప్రధాన ఆకర్షణగా నిలిచింది. గీతా ఆర్ట్స్ లాంటి పెద్ద బ్యానర్, రష్మిక క్రేజ్ కలయిక.. ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాను విడుదలకు ముందే సేఫ్ ప్రాజెక్ట్‌గా మార్చింది. నేషనల్ క్రష్‌గా అభిమానుల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న రష్మిక మందన్న.. తన నటన, గ్లామర్, అదిరిపోయే ఫాలోయింగ్‌తో ప్రేక్షకులను మాయ చేస్తుంది. ఇదే ట్రేడ్‌కు హెల్ప్ అయింది కూడా. హిట్లు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా.. మార్కెట్‌లో ఆమెకున్న డిమాండ్ ఏమాత్రం తగ్గలేదు. ది గర్ల్‌ఫ్రెండ్ నాన్‌థియేట్రికల్ బిజినెస్ రూపంలో వచ్చిన రూ. 21 కోట్ల ఆదాయం కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదు.. ఆమె స్టార్‌డమ్‌కు, బ్రాండ్ వాల్యూకు బలమైన నిదర్శనం. రాబోయే రోజుల్లో కూడా రష్మిక ప్రాజెక్టులు ఇదే స్థాయిలో బిజినెస్ చేస్తాయని ఈ విజయం రుజువు చేసింది. సినిమా నవంబర్ 7న విడుదల కానుంది.

# శివ ఈజ్ ఫరెవర్



'ఈ సినిమాను అప్పట్లో చూసిన మీ అమ్మానాన్నలకు.. ఇప్పుడు అదే ప్రేమతో చూడబోతున్న మీకు నా కృతజ్ఞతలు. ముఖ్యంగా నా మిత్రుడు రామ్‌గోపాల్‌వర్మకు థ్యాంక్స్. 36ఏండ్ల క్రితం 'శివ' తీసి నన్ను పెద్ద స్టార్‌ని చేశాడు. 4కె గా మార్చాక సినిమా చూశాను. స్టన్నింగ్‌గా, ఔట్‌స్టాండింగ్‌గా అనిపించింది. ఆరు నెలలు కష్టపడి ప్రతి సౌండ్ ట్రాక్‌ని ఒరిజినల్ సినిమా చేసినట్టుగా అద్భుతంగా డిజైన్ చేశారు రాము. డాల్బీ అట్మాస్‌లో మైండ్ బ్లోయింగ్‌గా ఉంది. శివ ఈజ్ ఫరెవర్. రాజమౌళి అన్నట్టు తెలుగు సినిమా అంటే ఆఫ్టర్ శివ.. బిఫోర్ శివ.. అంతే.' అని అగ్ర కథానాయకుడు అక్కినేని నాగార్జున అన్నారు. ఆయన కథానాయకుడిగా రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వంలో 36ఏండ్ల క్రితం విడుదలైన వెండితెర సంచలనం 'శివ'. తెలుగు సినిమా నడకను మార్చిన ఈ సినిమాకు అక్కినేని వెంకట్, యార్లగడ్డ సురేంద్ర నిర్మాతలు. అమల కథానాయిక. దివంగత నటుడు రఘువరన్ ప్రతినాయకుడు. ప్రస్తుతం రీరిలీజ్ ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో.. అన్నపూర్ణ స్టూడియోస్ స్థాపించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా టాలీవుడ్ కల్ట్ మూవీ 'శివ' సినిమాను 4k వెర్షన్‌లోకి మలచి, ఈ నెల 14న రీరిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా ఈ సినిమా 4k ట్రైలర్‌ని మంగళవారం హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగార్జున పై విధంగా స్పందించారు. చిత్ర దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ మాట్లాడుతూ '36ఏళ్ల తర్వాత మేమిద్దరం ఒకే స్టేజ్‌పై ఇలా మీ ముందు నిలబడి, 'శివ' రీరిలీజ్ ట్రైలర్ లాంచ్ చేస్తూ మాట్లాడతామని కలలో కూడా అనుకోలేదు. ఇది ఎవర్‌గ్రీన్ ఫీలింగ్. ఆ రోజులాగే, ఈ రోజు కూడా సౌండ్ విషయంలో నాగ్ నాకు క్రియేటివ్ ఫ్రీడమ్ ఇచ్చారు. రీరిలీజ్ కోసం కొత్త టెక్నాలజీని ఉపయోగించి సౌండ్‌ని చాలా బెటర్‌గా డిజైన్ చేశాం. చిరంజీవిగారు చెప్పినట్టు సినిమా ఉన్నంతవరకూ 'శివ' చిరస్మరణీయం' అని పేర్కొన్నారు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**